# చలమయ్య చరిత్ర

ఓలేటి కృష్ణ

చలమయ్యకు రెండేండ్ల ప్రాయంలో ఒక భయంకరమైన సంఘటన జరిగింది.

ఆ రోజు చలమయ్యను వరండాలో పడుకోబెట్టి వంటింట్లో ఏదో పనివుంటే చేసుకొంటోంది, తల్లి. కొంత సేపటికి తన పని ముగించేసి బిడ్డమీద మనసుపడి ఆదుర్దాగా అడుగులేసుకొంటూ వచ్చి ఎదురయిన దృశ్యం చూచేసరికి ఆమె దేహంలో రక్తప్రసరణ హఠాత్తుగా ఆగిపోయినట్టయింది — పడుకొని, కాళ్ళూ చేతులూ వూపుతూ ఆడుకొంటున్న చలమయ్యకు అడుగు దూరంలో త్రాచు పడగవిప్పి ఆడుతోంది!!

కెవ్వుమని కేకేస్తూ ఆ మాతృమూర్తి నేలకొరిగింది! ఇంట్లోవున్న ఒకరిద్దరు కలవరపాటుతో బయటికివచ్చి. ఈ దృశ్యాన్నిచూసి కాళ్ళు ఆడక అలాగే నిలబడి పోయారు!

కొంతసేపటికి దానంతటదే మెల్లగా వెళ్ళిపోయిందా పాము! పిల్లవాడికే ప్రమాదమూ జరగలేదు. కాని, నవమాసాలు మోసి, కని పెంచిన వ్యక్తిమాత్రం, లోకానికి దూరమయిపోయింది!

ఈ సంఘటనగూర్చి తలకో మాటనుకొన్నారు "ఒక వేళ తల్లి చావు తప్పిఉంటే బిడ్డ మనకు దక్కేవాడు కాదు. ఇద్దరిలో ఎవరో ఒకరు చావుకు గురికావలసిన గండం వుంది " అన్నారు జ్యోతిషం ఎరిగిన పెద్దమనుషులు కొందరు! "సరిగదా యీ జాతకుడి తలమీద నాగుపాము పడగవిప్పి ఆడగా—నీడ పడింది గాన యితడో కోటీశ్వరుడు కాగలడు" అని భవిష్యత్తును బయటదీసి వుంచారు!!

ఆ రోజుమునుండి చలమయ్యకు తల్లిలేని లోటు కనబడకుండా చూసుకోవలసిన బాధ్యతకూడ అతని తండ్రిమీద పడింది. కంటికి రెప్పలా కాని పెద్దచేశాడాయన!

పెద్దవాడయ్యాక, తన చిన్నతనంలో జరిగిన యీ భయంకర సంఘటన గూర్చి "వాళ్ళు" "వీళ్ళు" చిలువలు పలువలుగా వర్ణించి చెబుతూంటే—విని చలించి పోయేవాడు చలమయ్య! ... "అప్పుడు నువ్వూ మీ అమ్మతోపాటు నాకు దూరమయివుంటే.. నేనూ ఉరి బోసుకొని మీతో కలుసుకొనేవాడిని!" అని అప్పుడప్పుడూ అంటుండేవాడు చలమయ్య తండ్రి, అతనితో.

జీవితంలో సంపాయించడమే ముఖ్యమని అనుకొంటే చలమయ్య తన చేతిమీదుగా సంపాదించింది అంతా యింతా గాదు! అతనికి శుక్రమహర్దశే జరిగిందనాలి—పట్టిందంతా బంగారమే! పోగా బంగారంలాంటి యిద్దరు మగబిడ్డలు గలిగారాయనకు!!

అతని కింకా గుర్తుంది. అతనోసారి పెద్ద జబ్బు పడితే బిడ్డలు, యింకా యింట్లో వుండేవాళ్ళు తనకోసం ఎంతయిదిగా అల్లాడిపోయ్యారు?

వచ్చిన జబ్బు వదలకుండా రెండు నెలలు పట్టుకుంది. ఈ రెండు నెలల్లోనూ అతన్ని చెఱకు పిప్పిలా పేల్చేసిందా పాడు జ్వరం! బ్రతుకు మీద ఆశ వదలుకోవలసినంత పరిస్థితి వచ్చేసింది చలమయ్యకు! "ఇక బ్రతికి బయటపడ్డం దుర్లభం" అని అనుకొన్నారంతా!

చలమయ్యకు యీ మాటలు వినిపించకపోయినా, తనవైపు వాళ్ళు సారిస్తున్న ఆదోరకమయిన చూపును బట్టే తెలిసికోగలిగాడు. "ఏంటి? తను జీవించడం కష్టమేనా?..." వూహించుకోలేక పోయాడు. తనబిడ్డలు తనకోసం పడుతున్న బాధకు అతడు కలవరపడి పోయేడు. తదనంతరం 'వాళ్లకు' సంభవించే 'అనాధ' స్థితిగతులను తలపోసుకొని అతని హృదయం అల్లాడి పోయింది!

కాని, విధి నిర్ణయం మరో విధంగా వుంటే ఆ విధంగా ఎలా జరుగుతుంది?...కొద్ది రోజుల్లో క్రమక్రమంగా కోలుకోగలిగాడాయన. ఆయనా విధంగా గండాన్నుంచి బయటపడుతూండడంతో అతని సంతతికి ఎక్కడలేని చైతన్యం వచ్చింది!

ఇది జరిగి రెండు సంవత్సరాలయినా తిరిగిందో లేదో యింకో ముప్పు ముంచుకొచ్చింది, చలమయ్య జీవితంలో!

ఆనాడు పశువుల పండుగ!.

ప్రత్యేకంగా చలమయ్యను పశువుల పండుగ రోజుననే చూడాలి! పశువులకు పలకలు కట్టి వాటిని తరమడ

మంచె ఎక్కడ లేని సరదా పుట్టుందాతనికి! ఆ సమయంలో అతని హృదయం ఆనందోద్రేకంతో పరవశించిపోతుంది!

ప్రతిసారి లాగానే ఆయేడు కూడా వూరిలో వుండే పిన్నలయితేనేమి, పెద్దలయితేనేమి - అందరూ ఎంతో సంతోషంగా వుంటున్నారు. పశువులు తరిమే సమయం వచ్చింది...

చలమయ్యకు సొగసుగా కొమ్ములు దిరిగిన 'పుల్ల కోడె' వుండేది! దానికో అందమైన గురిగింజలు మెత్తిన పలకకట్టి పట్టుకొనే వగ్గాలతో సవాలు విసిరాడు. "నా కోడె పలక వూడదీసుకొన్నవాళ్ళకు యిదో - యీ కండువా యినాం!" అంటూ కొత్తగా తను కొన్న సరిగంచు పట్టు - చదకం చేతితో జోరుగా ఆడించాడు. ఉద్రేకం కొద్దీ కోడెను పరుగెత్తిస్తూ పగ్గం తగులుకొని హఠాత్తుగా క్రింద పడ్డాడు, చలమయ్య. ఫలితంగా తీవ్ర గాయాలు తగిలాయి.

వినోదం చూడవచ్చిన జనమంతా చలమయ్య చుట్టూ ప్రోగయ్యారు. నలుగురయిదుగురు దెబ్బలతో వళ్ళు మరచి పడివున్న చలమయ్యను ఎత్తుకొని పోయి యిల్లు చేర్చారు.

దీన్ని చలమయ్య జీవితంలో ఎదురయిన యింకో గొప్ప గండంగా భావించుకోవచ్చు. బాధతో నిస్సహాయంగా నీరసంగా పడివున్న తండ్రిని చూసి కొడుకులెంతగానో దుఃఖపడ్డారు. "నా నాయనే అమ్మతోపాటు నువ్వూ మాకు దూరమైతే మాగతేంగాను?"— అన్నంతగా ఏడ్చారు.

"ఆ సమయంలో తను ఆ ఆపదనుండి బయటపడితే వేయి దేవుళ్ళకు మొక్కుకొంటాం" అని యింటిల్లిపాదీ ఎంతగా ఆరాటపడింది. చలమయ్యకు బాగా జ్ఞాపకం వుంది! చిన్న కొడుకు ముందుకు వచ్చి "మా నాయనే మాకు దక్కితే పోలేరమ్మకు పొంగలి పెడతాం" అంటూ ఓ మేకపోతును కాళ్ళు కడిగి వదిలాడు! పెద్ద కొడుకు మరీ ముందుకొచ్చి..."వూళ్ళో ఉత్సవం జరిపిస్తా" అని మాటిచ్చాడు! ఇది యిలా వుండగా బంధువర్గం గంపలు మీద గంబలు 'వంటలు' చేసుక వచ్చి పరామర్శించారు చలమయ్యను.

దైవానుగ్రహంకల్ల యీ గండాన్నుంచీ బయటపడ్డాడు చలమయ్య...

—ఇవీ తన జీవితంలో చలమయ్యకు దాపురించిన గొప్ప గండాలు! ఇవి గాక, కాలు జారి తుంటి బెసకడం, కొత్త నీళ్ళు త్రాగగా పడిశం పట్టి జ్వరంగా మారడం, తేలు కుట్టి వళ్ళు సలవలు క్రమ్మడంలాంటి చిల్లర విపత్తులెన్నో వచ్చాయి. విచిత్రమేమిటంటే, ఎంత చిన్న యిక్కట్టు సంభవించినా అంతా ఎంతగానో అల్లాడిపోయేవారు!

ఎదురయిన యిన్ని గండాలను గట్టెంకించుకొని, తీసికొన్న అప్పుతీర్చమంటూ వచ్చిన యిన్ని కోర్టు యింజక్షన్ ఆర్డరులను "ఇంకా యింకా కొద్దికాలం నిదానించండి!" అని చెబుతూ నూరేండ్లు జీవించగలిగిన వ్యక్తి ఎంత విజయాన్ని సాధించిన ఘనుడో మీరే ఆలోచించండి? అలాంటి అఖండ విజయాన్ని సాధించగలిగిన అతను యిప్పుడు అదేపనిగా చావుకోసం పోతున్నాడు! కారణం ఏమైవుంటుందో మీరు వూహించగలిగారా? పూర్వం వలె యిప్పుడతనికో ప్రాణం ఎగిరిపోయే ఆపదవచ్చినా బాధపడేవాళ్లు ఎవరూ లేరు! ఇంకా నయం! 'చావు రాలేదే?' అని మాటిమాటికీ అతని మరణాన్నికోరే వాళ్లుగా తయారయ్యారంతా! ఇంతకూ అతడుచేసిన తప్పేమిటన్నారు?—

చలమయ్య పెద్దకొడుకు—రంగారావుకు 'రమ' అనే కూతురూ 'రవి' అనే కొడుకున్నూ. రమకు ఎనిమిదేళ్లు, రవికి ఐదేళ్లు. చిన్నకొడుకు రామారావుకు 'బాబు' అనే నాలుగేండ్ల పుత్రుడూ, 'బేబి' అనే రెండేళ్ల పుత్రికా కలిగారు!

రెండుమూడు మాసాలకు ముందు అనుకోనట్టు చిన్న జబ్బుచేసి చలమయ్య పెద్దమనుమడు 'రవి' అస్తమించాడు! విందలేనిదే బొందపోదంటారు. ఇంతకూ యీ చావుకు పట్టంగట్టుకొన్న నిందేమిటంటే ఎప్పుడో రెండేళ్ల క్రితం పిల్లోడికి ఉక్క కరిచిందట! అదే యిప్పుడిలా ముంచుకొచ్చిందని అనుకొన్నారందరూ!

ఇంట్లో అంతా లబోదిబోమని నోరు బాదుకొని ఏడుస్తూంటే-"విను కర్మంబొనరించును జననము మరణము..." అని భారతంలోని పద్యం చెబుతూ హితవు గరపబోయాడు మంచమీంచి చలమయ్యతాత! ఇందులో తప్పేమిటో మీరే చెప్పండి? కాకపోతే ఆ సమయంలో యీ వేదాంత ధోరణి ఎవరికీ రుచించివుండదు! ఈమాట అంటున్నాడో లేదో చిన్నకోడలు ముందుకొచ్చి — "యీ ముసలి

ముండాకొడుక్కి చావైనా వచ్చేట్టులేదు! వత్తి పీడ విరగడయిపోను!..." అని ఈసడించి పారేసింది!!

ఎప్పు చెప్పటి తనమీది పగో యీ సమయంలో చూపించినట్టనిపించింది చలమయ్యకు. ఏ పగో యేమొచ్చె! "అమ్మడూ ఆ గల్లవూనే చిప్ప యిటు పట్టుకొద్దూ? నీకు పుణ్యం వుంటుంది" అనో, లేకపోతే "యీ వక్క, ఆకు ఆ రోటిలో వేసి కాస్త నలిపిద్దూ?!" అనో అడుగుతుం టాడు చలమయ్య. పాపం! ముసలితన మాయె! ఆమాత్రం చేసిపెడితే వాళ్ళ గంటేం పోతుంది?...ఇంతకీ 'నాకేం!' అంటే 'నాకేం!' అంటూ పెద్దకోడలూ, చిన్నకోడలూ మాటిమాటికి పంతా లేసుకొని- "యింకా పాడు చావు వచ్చేట్టు లేదు! యింకో నూరేండ్లు బ్రతికి యితగాడు రాజ్యమేలాలి గాబోలు!" అని ఆదేపనిగా చీదరించుకోవ డమే! పాపం చలమయ్య "నా కర్మ" అనుకొంటూ సమా ధాన పడుతుంటాడు.

ఈ రభసే యేదో తన కొడుకుల ముందే జరిగిందనుకో! పెళ్ళాం బెల్లం గాబోలు, వాళ్ళను వెనకేసుకొని తన చావునుగూర్చి మరీ వేపుకు తింటారు కన్నకొడుకులు. ఈవిధంగా ఒకరోజా, ఒకసారి జరిగితే ఫరవాలేదు. రోజు కెన్నిమార్లో? వాళ్ళ వుబలాటమంతా చల మయ్య చావుమీదే వుంటుందనిపిస్తుంది!

'ఎంత చావమన్నా ఎవరో వూళ్ళోవాళ్ళు అనడం లేదుగదా! ఏదో తన బిడ్డలో, బిడ్డల భార్యలో అంటు న్నారులే!' అని యిన్ని రోజులుగా ఎన్ని అంటున్నా తోసుకురాగలిగాడు చలమయ్యతాత!

ఇది పోని, యింతటితోనే ఆగితే ఏ చిక్కు వచ్చేది గాదు. సరిగ్గా యీరోజు ఏమి జరిగిందనుకొన్నారు?

పట్నం పోయిన చిన్నకొడుకు రామారావు యింటికి తిరిగి వస్తూ 'బిస్కట్ పొట్లం' ఒకటి పట్టుకొచ్చాడు. ఖర్మ కొద్దీ తనం టేనే పురుగులా చూసే చిన్న కోడలు చేతిలోనే పడాలా ఆ బిస్కట్లు పొట్లం?

'పసిపిల్లోళ్ళకి వరుసగా పంచిపెడుతూన్నది తనకూ యివ్వక పోతుందా?..' అని అనుకొన్నాడు చలమయ్య తాత! కాని, అతని చేతిలో కాసింత ముక్క పడేస్తేనా?...

కడుపు తెగించి అడగనే అడిగేశాడు - "ఒసే! కోడలా! నాకో బిస్కట్టు బిళ్ల యివ్వరాదటే?!—" అని.

అంతే! వులుకొమనే త్రాచులా లేచింది చిన్న కోడలు - "ఆ పాడుచావు..." అనే పాటే, యింకా వుధృతంగా వాగేసింది.

బిస్కట్లు, చాక్లెట్లు, అప్పచ్చులు...తినాల్సింది పిల్ల లేనా?...వృద్ధాప్యం రెండో బాల్యం వంటిది.

అందుకే తనూ బిగుసుకొని కూర్చున్నాడు, తిండి ముట్ట కుండా. కాని, అతన్ని పసిపిల్లను బుజ్జగించినట్టు బుజ్జ గించి తిండిపెట్టే మాతృభావం పాషాణంలాటి కోడళ్ల హృదయాల్లో ఎలా కలుగుతుంది?...

ఈ విషయాన్ని మగళ్ల చెవిలో అప్పుడే వూదినట్టుంది! కనిపెంచి నందుకైనా వుండొద్దూ- వాళ్లకైనా ఆ మాత్రం బుద్ధి? తన్ను బుజ్జగించి బువ్వ తినిపించపోతే మానె! వాళ్ల మానాన వాళ్లుండ రాదూ?..

"తినకపోతే పోనీలే! ముండా కొడుక్కి అట్లైయినా చావు వస్తుందేమో!" అని చెడామడా పేలారు. ఇంత జరిగితే యిక బ్రతికి పొముకొనే దేమిటో చెప్పండి?...ఇదీ చలమయ్య బాధ!

ఒకటి రెండు గంటలు అదే పనిగా ఆలోచించాడు చలమయ్య తాత. 'తనెందుకు యిన్ని రోజులు బ్రతకాలి? చిన్నప్పుడు తన తలవద్ద ఆడిన పామేదో తన్ను కరచి చంపి వుండరాదూ?. అంత పెద్ద జబ్బుచేసిన ఆ రోజుల్లో తనెందుకు పుటుక్కుమని రాలి పోయుండ గూడదూ...? ఆ పుల్ల కోడె క్రిందబడి ఎముకలు విరగొట్టు కొన్నప్పుడు యీ జీవుడెందుకు ఎగిరిపోయుండరాదూ?...

. ఆ రోజుల్లో తను ఎక్కడ చావు పాలవుతానో అని బాధతోను, భయంతోను గిజ గిజలాడిపోయిన హృదయా లేనా యిప్పుడు తన చావు కోరేది?! . అప్పుడు తను జీవించవలసిన అవసరం వాళ్ళకుండేది, యిప్పుడు లేదనే గదా?...ఎక్కువ రోజులు బ్రకటం తప్పుగాబోలు!

'ఇంకా వచ్చే చావు ఎప్పుడొస్తుందో రాని, అని కాచుకొని కూర్చుంటే 'పీర్ళు' సాహసించి తన పీక పిసి కేందుకైనా వెనుదీయరు!...ఆ చావేదో ఏ రైలు క్రింద

పడో, తనే తెచ్చుకోవడం ఉత్తమం!—యింకా వీళ్ళ మధ్య అల్లాడేకంటే !!"

అందుకే స్థిర నిశ్చయంతో యిల్లు వదలిపోతున్నాడు చలమయ్య. ఇదీ అసలు విషయం! తెలిసిందా?.

అడో, అప్పుడే రైలు పట్టాల దగ్గరికి వచ్చేశాడే! అరె! పట్నంపోయే రైలుగూడ అప్పుడే వచ్చేస్తోందే! అయ్యో, ఏమైపోతాడో పాపం! కొంప దీసి రైలు క్రిందబడడు గదా ?! ఉహు! ప్రయోజనం లేదు.—వుండే తీరు చూస్తే పడేటట్టే వుంది అరెరె! రైలు మరీ దగ్గరికి వచ్చేసిందే! ఇదో పడబోతున్నాడే?!... అయ్యొయ్యో!!.

"—తాతా రైలు క్రింద పడతావ్, అగు!-" ఎవరో, ఎక్కడి నుండి వచ్చాడో, దేవుడే పంపినట్టుంది!—ఓ పద్నాలుగేళ్ళ కుర్రాడు పరుగెత్తుకొంటూ వచ్చి తాతను పట్టుకొన్నాడు!!! చలమయ్య తాతను రక్షించాడు. రైలు దొర్లిపోయింది! ..

పధ్నాలుగేళ్ళ ఆ కుర్రవాణ్ణి చూడగానే చలమయ్య తాతకి మనమడు కళ్ళకి కట్టినట్టయ్యాడు. బుల్లి మనమరాలు బేబి గుర్తుకొచ్చింది. ఈపాటికి ఇంట్లో వుంటే తాత గుండుమీద మిగిలివున్న వెంట్రుకలు పీకేది. నెత్తిమీదకెక్కి స్వారీ చేసేది.

క్షణంపాటు అలా నిలబడిపోయాడు, చలమయ్య. కర్రతో టిక్కు-టిక్కు నేలకు కొట్టుకుంటూ ఇంటిదోవ పట్టాడు.

## మహోన్నత లక్ష్యం

పంచవర్ష ప్రణాళికలు ప్రజాభ్యుదయానికి ప్రాతిపదికలు. కాబట్టి అన్ని తరగతుల ప్రజలు వాటి ప్రాముఖ్యతను గుర్తెరిగి వాటి అమలులో పాల్గొని తద్వారా విభిన్న అభివృద్ధి రంగాలలో తలపెట్టిన బృహత్తర లక్ష్యాలను సాధించడం అవసరం.

ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన రెండు ప్రణాళికలు ఏమి సాధించాయి?

రాష్ట్రానికి గర్వకారణమైన నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణం శీఘ్రగతిని కొనసాగుతున్నది. ఆనకట్ట రాతిపని దాదాపు మూడింట ఒక వంతు పూర్తయింది. ఇంకా అనేక ఇతర భారీ, మధ్యరకం, చిన్న రకం నీటి పారుదల పథకాల పని పూర్తి అయింది లేదా పూర్తి కావచ్చింది.

విద్యుచ్ఛక్తి ఉత్పత్తి పెరుగుతూ ఉంది. రెండవ ప్రణాళిక ఆరంభంలో రాష్ట్రంలో 700 గ్రామాలకు మాత్రమే విద్యుచ్ఛక్తి సౌకర్యం ఉండగా ఇప్పుడు 3,281 గ్రామాలకు ఈ సౌకర్యం విస్తరించినది. ఎగువ సీలేరు ప్రాజెక్టు, శ్రీశైలం జల విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు పనులు పూర్తయినప్పుడు రాష్ట్రంలో విద్యుదుత్పాదన శక్తి మరింత హెచ్చుతుంది.

ఆహార ధాన్యాల ఉత్పత్తి ద్వితీయ ప్రణాళికారంభంలో 55.37 లక్షల టన్నులు ఉండగా ఇప్పుడు 65.54 లక్షల టన్నులకు పెరిగింది.

సుమారు 220.68 మంది ప్రజలు నివసిస్తున్న 352 బ్లాకులలో యీనాడు సమాజాభివృద్ధి కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నది. పంచాయతీ రాజ్యపథకం ప్రవేశపెట్టబడిన తరువాత ఇప్పుడు రాష్ట్రంలో 293 బ్లాకులలో పంచాయతీ సమితులు, ఇరవై జిల్లాలలోనూ జిల్లా పరిషత్తులు పనిచేస్తున్నాయి. దీనితో ప్రజాస్వామిక వికేంద్రీకరణలో ఒక ముఖ్యఘట్టం ఆరంభమైంది.

అన్ని రకాల విద్యా సంస్థల సంఖ్యకూడా గమనించదగినంతగా పెరిగింది. 6-11 సంవత్సరాల మధ్య వయసుగల పిల్లలకొరకు నిర్బంధ ప్రాథమిక విద్యాపథకం గత జూన్ 1 వ తేదీనుంచి అమలు జరుగుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన ప్రణాళికలు సాధించిన విజయాలలో ఇవి కొన్ని మాత్రమే. తృతీయ ప్రణాళికలో రు 305 కోట్ల ఖర్చుతో మనం మహోన్నతమైన లక్ష్యాలను తలపెట్టాము. మన మందరమూ ఏక దీక్షతో కృషి సల్పినట్లయితే ఈ లక్ష్యాలను అవశ్యం సాధించి తీరుతాము.

—సమాచార పౌర సంబంధముల శాఖ, ఆంధ్రప్రదేశ్.